క్లుప్తంగా

నేడు ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

తుని రూరల్: ఎస్.అన్నవరంలో నూకాలమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా, లక్ష్మీచైతన్య దంపతులు గురువారం శంకుస్థాపన చేస్తారని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఉదయం 7.42 గంటలకు శ్రవణ నక్షత్రం మిథున లగ్నములో శంకుస్థాపన మహోత్సవం జరుగుతుందన్నారు. పాత సంచుల వర్తకం సంఘం, గ్రామస్తుల సహకారంతో అమ్మవారి ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నట్టు చెప్పారు.

పూర్తిస్థాయిలో తాగునీరు అందించాలి



రమణయ్యపేటలో మంచినీటి సరాఫరా పథకాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: ప్రస్తుతం వేసవి నేపథ్యంలో గ్రామాల్లోని ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అధికారులకు సూచించారు. మండలంలోని రమణయ్యపేటలో సమగ్ర రక్షిత మంచి నీటి సరాఫరా పథకాన్ని బుధవారం ఎంపీపీ పరిశీలించారు. గ్రామస్తులకు నీటి సరఫరాపై అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం, సాయంత్రం తాగునీటి సరాఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీరామ్, ట్రాన్స్‌కో ఏఈ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోకవరం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై గోకవరం పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. దేవరపల్లికి చెందిన గంగిరాజు వీర్రాజు గత కొంత కాలంగా గుమ్మళ్లదొడ్డిలో నివాసం ఉంటూ స్థానిక హెచ్‌పీసీఎల్ ప్లాంట్‌లో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి బైక్‌పై ఇంటికి వెళుతుండగా కోరుకొండ నుంచి గుమ్మళ్లదొడ్డి వైపు వస్తున్న ఆవుల మంద అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు హెచ్‌సీ భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పద్య పఠనం, శ్రవణంపై శిక్షణ



ఏలేశ్వరం గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న సుబ్బారావు

ఏలేశ్వరం: విద్యార్థి దశ నుంచే పద్యాలపై పట్టు సాధించాలని పెద్దాపురం మహారాణి కళాశాల తెలుగు అధ్యాపకుడు ఎ.సుబ్బారావు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. దీనిలో భాగంగా బుధవారం విద్యార్థులకు లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో పద్య పఠనం, శ్రవణంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు పద్యాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పద్య పఠనంలో జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. అనంతరం చిత్రలేఖనంపై రిటైర్డ్ ఉపాధ్యాయుడు మామిడి రాము శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిపై పలువురి దాడి

ప్రత్తిపాడు రూరల్: రాచపల్లి శివారు ప్రాంతంలోని పోలవరం వంతెన వద్ద కొందరు వ్యక్తులు తనపై దాడి చేశాని కిర్లంపూడి గ్రామానికి చెందిన బందుల మణికంఠ ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కిర్లంపూడి గ్రామానికి చెందిన మణికంఠ అత్తగారి ఊరైన రాచపల్లి బైక్‌పై వెళుతూ పోలవరం వంతెనపై బైక్‌ను రోడ్డుపై పార్క్‌చేసి మూత్ర విసర్జన చేస్తున్న సమయంలో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తనతో ఘర్షణకు దిగారు. తనపై దాడి చేసి గాయపర్చినట్లు మణికంఠ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పార్టీ శ్రేణులను కలిసిన సత్యప్రభ

రౌతులపూడి: గ్రామాల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి టీడీపీకి పూర్వవైభవాన్ని తీసుకురావాలని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ పిలుపు నిచ్చారు. ఆమె భర్త వరుపుల రాజా మరణానంతరం పార్టీ ఇన్‌చార్జ్ బాధ్యతలు స్వీకరించిన ఆమె బుధవారం తొలిసారిగా మండల గ్రామాల్లోని ముఖ్యనాయకులు, కార్యకర్తలను కలిశారు. మండలంలోని దిగువశివాడ, గంగవరం, రాజవరం, రామకృష్ణాపురం, ఎం.కొత్తూరు గ్రామాల్లోని పార్టీ శ్రేణులను కలిసి పలు సూచనలు చేశారు.

చిన్నారుల చూపు.. సంగీతం వైపు

- మ్యూజిక్‌పై ఆసక్తి చూపుతున్న పిల్లలు
- చిట్టి చేతులతో కీబోర్డుపై సరిగమలు
- తుని ఎఫ్ఎం మ్యూజిక్ అకాడమీలో శిక్షణ



తుని సంగీత అకాడమీలో శిక్షణ పొందుతున్న చిన్నారులు

తుని: నిత్యం పుస్తకాలతో కుస్తీలు పడుతున్న ప్రస్తుత సమాజంలో తమకు అడవిడుపు కావాలంటూ చిన్నారులు సరిగమల వైపు దృష్టి పెడుతున్నారు. కరోనా సమయంలో చిన్నాపెద్దా అన్న తేడా లేకుండా అరచేతిలో సెల్‌ఫోన్ పెట్టుకుని కాలక్షేపం చేసే అలవాటు పెరిగిపోయింది. సామాజిక మధ్యమాలు, ఆటలతో పాటు ఆన్‌లైన్ చదువులను అలవాటు చేసుకున్నారు. ప్రతిఒక్కరి జీవితంలోనూ బాల్యం ఎంతో కీలకం. ఇది పట్టించుకోని తల్లిదండ్రులు తమ పిల్లలపై బలవంతంగా చదువును రుద్దుతున్నారు. విలువైన బాల్యం సెల్‌ఫోన్‌తో నరకప్రాయం చేసుకుంటున్న చిన్నారులను సంగీతం వైపు నడిపించాలన్న తపనతో కాకినాడ జిల్లా తునికి చెందిన ఆరుగుల ఫ్రాంక్లిన్ సుకుమార్ ఎఫ్ఎం మ్యూజిక్ అకాడమీని ఏర్పాటు చేశారు. తల్లిదండ్రులతో మాట్లాడి పలువురు చిన్నారులను అకాడమీలో చేర్పించారు. దీంతో చిన్నారులు సెల్‌ఫోన్ వద్దు సరిగమలు ముద్దు అంటూ ఇష్టంగా సంగీతం నేర్చుకుని అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తున్నారు. తొలుత పది మందితో మెదలై ఇప్పుడు 100 మంది వరకూ చిన్నారులు శిక్షణ పొందుతున్నారు.

పలు విభాగాల్లో శిక్షణ

తుని బ్యాంకుకాలనీలో ఏర్పాటు చేసిన ఎఫ్ఎం మ్యూజిక్ అకాడమీలో ఫోక్, క్లాసికల్ మ్యూజిక్‌తో పాటు వాయిస్ ఎడిటింగ్, రథమ్ ప్రొగ్రామింగ్, వెస్టరన్ నోటేషన్ విభాగాల్లో శిక్షణ ఇస్తున్నారు. కీబోర్డు, గిటార్, ఫ్లూట్ , వొకల్‌ను చిన్నారులు ఇష్టంగా నేర్చుకుంటున్నారు. నిష్ణాతులైన మ్యూజీషియన్లతో సరిగమలను నేర్పుతున్నారు. ప్రస్తుతం 100 మంది వరకు చిన్నారులు శిక్షణ పొందుతున్నారు. భవిష్యత్‌లో వీరంతా సంగీతంలో ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం లభించింది.

గిటార్‌లో శిక్షణ



నాకు చిన్ననాటి నుంచి గిటార్ నేర్చుకోవాలన్న తపన ఉండేది. అప్పట్లో తునిలో సంగీత అకాడమీ లేదు. ఎఫ్ఎం మ్యూజిక్ అకాడమీ అందుబాటులో ఉండడంతో చేరి గిటార్ నేర్చుకుంటున్నాను. మా తల్లిదండ్రులు ప్రోత్సాహంతో సంగీతాన్ని ఆస్వాదిస్తున్నాను. గిటార్‌లో శిక్షణ పొంది మ్యూజిక్‌లో ఉన్నత స్థాయికి వెళ్లాలన్నది నా ఆశయం.

–సత్య శ్రీ, విద్యార్థిని, తుని

కీ బోర్డు నేర్చుకుంటున్నాను



నేను మూడో తరగతి చదువుతున్నాను. సెల్‌ఫోన్‌లో గేమ్స్, కార్టున్స్ ఆడటం అలవాటు చేసుకున్నాను. దీంతో చదువుపై ఏకాగ్రత తగ్గిపోయింది. నా స్నేహితులు సంగీతం నేర్చుకుంటున్నామని చెప్పారు. నేను కూడా మ్యూజిక్ అకాడమీలో చేరాను. కీ బోర్డుపై శిక్షణ తీసుకుంటున్నాను. సరిగమలు నేర్చుకోవడం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. ఇప్పుడు సెల్‌ఫోన్ జోలికి పోవడం లేదు.

–సోరోస్ ధన్య, విద్యార్థిని, తుని

ఇష్టంగా నేర్చుకుంటున్నాను



నేను నాల్గో తరగతి చదువుతున్నాను. పుస్తకాలతో కుస్తీ పట్టి మానసిక ఒత్తిడికి గురై చిరాకుగా ఉండేది. ఇటువంటి సమయంలో నా స్నేహితుడి సూచన మేరకు ఎఫ్ఎం మ్యూజిక్ అకాడమీలో చేరాను. ప్రస్తుతం కీ బోర్డు నేర్చుకుంటున్నాను. రెండు గంటల పాటు సరిగమలు సాధన చేయడంతో ప్రశాంతంగా ఉంది. సెల్‌ఫోన్ చూడటం మానేశాను. సంగీతంలో ఇంత ఆహ్లాదం ఉంటుందని ఊహించలేదు. భవిష్యత్‌లో మంచి కీబోర్డు సాధకుడిగా కావాలన్నది నా ఆశయం.

–ఎం.వర్షిత్, విద్యార్థి, తుని

100 మందికి శిక్షణ



ప్రస్తుత పోటీ ప్రపంచంలో అందరూ విద్య, ఉద్యోగానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. సంగీత కళకు ఆదరణ తగ్గిపోతోంది. చిన్నారులు సెల్‌ఫోన్‌కు ఆకర్షితులై భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. ఇది గమనించి నా స్నేహితుల సహకారంతో ఎఫ్ఎం మ్యూజిక్ అకాడమీని పెట్టాను. మెదట్లో పిల్లలు తక్కువగా చేరారు. ఇప్పుడు పరిస్థితి మారింది. ప్రస్తుతం 100 మంది వరకు సంగీతం నేర్చుకుంటున్నారు. అతి తక్కువ సమయంలోనే పలువురు చిన్నారులు కీబోర్డుపై స్వరాలు వాయిస్తున్నారు. నేను నేర్చుకున్న సంగీతం ఇప్పుడు ఉపయోగపడింది.

–ఆరుగుల ఫ్రాంక్లిన్ సుకుమార్, ఎఫ్ఎం అకాడమీ, వ్యవస్థాపకుడు

గోర్సపాలెంలో విద్యుత్ సమస్యకు చెక్



గోర్సపాలెంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన వైస్ ఎంపీపీ గంగబాబు

తొండంగి: కోదాడ పంచాయతీ గోర్సపాలెంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించిందని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు తెలిపారు. గోర్సపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. దీర్ఘకాలంగా గ్రామంలో లో ఓల్టేజి సమస్యతో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి తక్షణమే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ మేరకు యుద్ధ ప్రాతిపదికన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ బుర్తి రత్నకుమారి, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ బుర్తి నాని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడే వారికి గుర్తింపు



సిరిపురంలో శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్, పార్టీ శ్రేణులు

ఏలేశ్వరం: కష్టపడి పని చేసే వారికి పార్టీలో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. మండలంలోని సిరిపురంలో బీజేపీ జిల్లాకార్యదర్శి కొల్లా శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ బీజేపీలో ప్రతి కార్యకర్త, నాయకులకు గుర్తింపు ఉంటుందన్నారు. గత 30 ఏళ్లుగా పార్టీకి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సింగిలిదేవి సత్తిరాజు, గండి కొండలరావు, మదినే బాబ్జీ, కర్రిధర్మరాజు, దాకేశ్వరావు, ఈగల వెంకటేశ్వరరావు, రెడ్డిలోవరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం



టి.అగ్రహారంలో ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

రౌతులపూడి: మండలంలోని బీబీ పట్నం, కోడూరు గ్రామాల్లోని ఆలయాల వద్ద బుధవారం ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం 7.45 గంటలకు బీబీ పట్నం వేములమ్మ అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, కోడూరులోని కోదండరామస్వామి ఆలయం వద్ద ధ్వజ స్తంభం ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని కోదండరామ స్వామి, వేములమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం రెండు గ్రామాల్లోనూ ఆలయాల వద్ద అన్నసమారాధన నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, కోడూరు గ్రామ సర్పంచ్ లంక వెంకటలక్ష్మి, శ్రీను దంపతులు, బీబీ పట్నం సర్పంచ్ వడల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని బవురువాకలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా బుధవారం ఆలయ ప్రాంగాణంలో హోమం, కలశ పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

శంఖవరం: నెల్లిపూడి పంచాయతీ టి.అగ్రహారంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బుధవారం ధ్వజ స్తంభం ప్రతిష్ఠించారు. ఉదయం వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారు, ధ్వజ స్తంభాన్ని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరాల శ్రీను, సర్పంచ్ నరాల శ్రీలతా తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

సత్రం భూములపై ఉద్యమం తీవ్రతరం



రంపయర్రంపాలెంలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం నాయకులు

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలో సుందరమ్మ సత్రం భూములపై ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. ఈ మేరకు గ్రామంలో బుధవారం సంఘం సభ్యులతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్రం భూములకు బహిరంగ వేలం నిర్వహించాలని అనేక సార్లు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినా దేవదాయ శాఖ అధికారుల్లో ఎటువంటి చలనం లేదన్నారు. దీనిని బట్టి భూస్వాములు ఏ విధంగా చక్రం తిప్పుతున్నారో అర్థమవుతోందన్నారు. దీనిపై ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని, అవసరమైతే రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడించి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, నాయకులు కె.సతీష్, దాశెట్టి సురేష్, గోలి మునలయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం



కోటనందూరులో ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోటనందూరు: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులను బుధవారం ఘనంగా సత్కరించారు. అల్లూరి సీతారామరాజు ప్రధాన అనుచరుడు గామ్ గంటదొర వర్ధంతి సందర్భంగా స్థానిక అల్లూరి సీతారామరాజు సేవాసంఘం ఆధ్వర్యంలో కోటనందూరులో 533 మార్కులు సాధించిన సరస అక్షయచాతుర్య, 531 మార్కులు సాధించిన భీమిరెడ్డి దుర్గాప్రసాద్, 523 మార్కులు సాధించిన సామిరెడ్డి శ్రీజాలను సత్కరించారు. భవిష్యత్‌లో క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. గ్రామ సర్పంచ్ గర్సింగు శివలక్ష్మి, తుని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు గర్సింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, కురందాసు రాంబాబు, ఉల్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిప్పుల కొలిమి

తుని: ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 7 గంటలకే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. కొద్దిరోజులుగా ఎండల తీవ్ర స్థాయిలో ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఎండ, ఉక్కబోతతో ప్రజలు విలవిల్లాడారు. తుని నియోజకవర్గంలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వ్యాపారుల ఉదయం 10 గంటలకు దుకాణాలను మూసి వేసి సాయంత్రం తీశారు. ఎండ తీవ్రతను తట్టుకోలేక ప్రజలు చెరకు రసం, కొబ్బరి బొండాలు, మజ్జిగ, బార్లీ తదితర శీతల పానీయాలను తీసుకున్నారు. గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితులను చూడలేదని పలువురు చెబుతున్నారు. ఇదే పరిస్థితి మరో 4 రోజుల పాటు ఉంటుందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని వైద్యులు సూచిస్తున్నారు.

విద్యా కానుక పంపిణీకి జోరుగా ఏర్పాట్లు

- పాఠశాలలు తెరిసిన రోజే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు
- పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- ఇప్పటికే పాఠశాలలకు చేరిన పుస్తకాలు



తుని మండల స్టాకు పాయింట్ వద్ద పాఠ్య, రాత పుస్తకాలు

తుని రూరల్: ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేయడంతో పాటు పేద విద్యార్థుల కోసం అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న విద్యాకానుక వంటి పథకాలను అమలు చేస్తోంది. కాగా ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలు తెరిచిన రోజే ప్రభుత్వం ఉచితంగా సమకూర్చే జగనన్న విద్యాకానుకలు, పాఠ్య, రాత పుస్తకాలు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2022–23 విద్యా సంవత్సరం పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించిన విజయం తెలిసిందే. మండలాల వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను నగదు బహుమతులతో ప్రోత్సహించనుంది.

మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యంగా...

ప్రైవేట్ స్కూళ్ల కంటే ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులే మెరుగైన ఫలితాలు సాధిస్తారనే ఒరవడి సృష్టించేందుకు విద్యాశాఖ ముందస్తు ప్రణాళికతో అడుగులు వేస్తుంది. దీనిలో భాగంగా ఇప్పటికే విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలను ఆయా మండల కేంద్రాల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు చేర్చారు. ఇప్పటికే మండల కేంద్రాలకు చేరిన జగనన్న విద్యాకానుక కిట్లను పాఠశాలలకు చేరుస్తున్నారు. ఈ నెల 12న పాఠశాలలను తెరుస్తుండగా ఆదే రోజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా జగనన్న విద్యాకానుకలు, పుస్తకాల పంపిణీ చేస్తారు. ఆ వెంటనే స్థానికంగా ఆయా పాఠశాలల్లో ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు జేవీకే కిట్లు, పుస్తకాలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

22 వేల మంది విద్యార్థులు

తుని నియోజకవర్గంలో 187 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఆంధ్ర ప్రదేశ్ ఆదర్శ, ఎస్సీ, ఎస్టీ గురుకుల, బీసీ గురుకుల, కేజీబీవీ వంటి ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 22 వేల మందికిపైగా విద్యార్థులు ఒకటి నుంచి పది తరగతులు చదువుతున్నారు. అడ్మిషన్లు పూర్తయితే ఈ సంఖ్య మరింత పెరగనుంది. తుని మండలంలో విద్యార్థులకు 90 శాతం పాఠ్య, రాత పుస్తకాలు చేరాయి. షూలు, సాక్సులు, బెల్టులు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు అందుబాటులో ఉన్నాయి. స్కూల్ బ్యాగ్‌లు, యూనిఫారం ఇంకా రావాల్సి ఉంది. తొండంగి మండలంలో విద్యార్థులకు 71 శాతం పాఠ్యపుస్తకాలు, 74 శాతం రాత పుస్తకాలు, వందశాతం షూలు, సాక్సులు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు అందుబాటులో ఉండగా బెల్టులు, స్కూల్ బ్యాగ్‌లు, యూనిఫాం రావాల్సి ఉంది. కోటనందూరు మండలంలో 60 శాతం పాఠ్య, రాత పుస్తకాలు, జగనన్న విద్యాకానుకల కిట్లు అందుబాటులో ఉన్నాయి.



పాఠశాలలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న జేవీకే కిట్లు

పంపిణీకి చర్యలు



ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అవసరమైన పాఠ్య, రాత పుస్తకాలు, జగనన్న విద్యాకానుక కిట్లు మండల స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు చేరవేస్తున్నాము. పాఠశాలలు తెరిసే నాటికి వందశాతం పుస్తకాలు, జేవీకే కిట్లు అందుబాటులోకి వస్తాయి. ఈ నెల 12న సీఎం లాంఛనంగా ప్రారంభించిన తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులకు పుస్తకాలు, జేవీకే కిట్లను అందజేస్తాం. అడ్మిషన్లు జరుగుతున్నందున విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

– పరవాద గీతాదేవి, ఎంఈఓ, తుని

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



భావవరం ఆలయంలో కృష్ణుని విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: మండలంలోని భావవరం గొల్లపేటలో నూతనంగా నిర్మించిన కృష్ణుడి ఆలయ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తెలిపారు. భావవరం కృష్ణుడు ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే చంటిబాబు స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. గొల్లపేటలో ఆలయ నిర్మాణానికి కృషి చేసిన వారిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ అప్పారావు కాపు, వైఎస్సార్ సీపీ నాయకులు కంచి అప్పారావు, లక్ష్మణదొర తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ

కోటనందూరు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం హౌసింగ్, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి జియో ట్యాగింగ్, మ్యాపింగ్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. జగనన్న పాలవెల్లువ తదితర సంక్షేమ పథకాలపై సమీక్షించారు. హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్మికుడి ఇంట్లో చోరీ

బంగారు నగలు, నగదు అపహరణ



సంఘటన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సునీత

సామర్లకోట: స్థానిక రాక్ సిరామిక్స్ కార్మికుడు పువ్వుల సుధాకర్ ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు అపహరణకు గురైంది. స్థానిక సత్యనారాయణపురంలో సుధాకర్, స్వరూప దంపతులు అద్దెకు ఉంటున్నారు. వేసవి తాపానికి తాళలేక సమీపంలోనే ఉన్న స్వరూప తల్లి ఇంటిలో ఏసీ ఉండడంతో మంగళవారం రాత్రి ఇంటి తలుపులకు తాళం వేసి అక్కడ నిద్రించేందుకు వెళ్లారు. ఇది గమనించిన దొంగలు మొదటి అంతస్తులోని ఇంటి తలుపుల తాళాలు, బీరువాలోని బంగారు గొలుసు, రెండు ఉంగరాలు, దుద్దులు, రూ.92 వేలు నగదు దోచుకుపోయారు. రెండు బీరువాల్లోని నగదు, ఆభరణాలు దోచుకుపోయారు. బుధవారం ఉదయం ఇంటికి వచ్చిన దంపతులు తలుపులు తెరిచి ఉండటం గమనించి చోరీ జరిగినట్టు గుర్తించారు. భార్యకు నల్లపూసలు చేయించేందుకు పొదుపు చేసిన మొత్తాన్ని దోచుకుపోయారని సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశాడు. వార్డు కౌన్సిలర్ సేసేని సురేష్ ఫిర్యాదు మేరకు సీఐ కె.దుర్గాప్రసాద్, ఎస్సై టి.సునీత, క్లూస్ టీమ్ బృందం సంఘటనా ప్రదేశాన్ని సందర్శించి సమాచారం సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.